క్లుప్తంగా

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ అందజేస్తున్న లయన్స్ క్లబ్

పులిచెర్ల(కల్లూరు): మొగరాల ఉన్నత పాఠశాలకు ఆదివారం కల్లూరు లయన్స్ క్లబ్ సభ్యులు రూ.25 వేల విలువైన కంప్యూటర్‌ను వితరణ చేశారు. లయన్స్ క్లబ్ సలహా దారుడు పోకల తాతయ్య, కార్యదర్శి మహమ్మదాలీ, రాజారెడ్డి, వెంకటసిద్ధులు, రామయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఎంపీడీవో బాలాజి

పెద్దపంజాణి: ఉపాధి కూలీలు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలని ఎంపీడీవో బాలాజి తెలిపారు. ఆయన ఆదివారం మద్దలకుంటలో జరుగుతున్న ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు అన్ని గ్రామాల్లోని ఉపాధి కూలీలను కలిసి ఈకేవైసీ చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. జూనియర్ ఇంజినీర్ సుబ్రమణ్యం, సిబ్బంది బాబు పాల్గొన్నారు.

చెక్ డ్యామ్ పూడ్చివేత



చెక్ డ్యామ్ వద్ద చేసిన బండరాళ్లు

బైరెడ్డిపల్లి: పలమనేరు–కుప్పం జాతీయ రహదారిలోని దేవదొడ్డి సమీపంలో చెక్ డ్యామ్‌ను ఒక వ్యక్తి శనివారం రాత్రి బండరాళ్లు వేసి పూడ్చి వేశాడు. దీనిపై కలెక్టర్, తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ దేవదొడ్డి సమీపంలోనున్న మూడు చెరువులు నిండి నీరు చెక్ డ్యామ్‌లో నిలుస్తుందని పేర్కొన్నారు. చెక్ డ్యామ్ పూడ్చి వేయడంతో నీరు వృథా అవుతుందని వెల్లడించారు.

హంద్రీ-నీవా కాలువకు గండి



హంద్రీ-నీవా కాలువకు గండి పడి వృథాగా పోతున్న నీరు

గుడుపల్లె: హంద్రీ నివా కాలువలో నీటి ప్రవాహం వెళ్తున్న సమయంలో కాలువకు గండి పడడంతో అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. గుడుపల్లె మండలంలోని ఇరిసిగానిపల్లె సమీపంలో హంద్రీ-నీవా కాలువలో ఏర్పాటు చేసిన బ్రిడ్జి నుంచి మట్టి కాలువకు జాయింట్ చేసిన ప్రాంతంలో గండి పండింది. దీంతో నీరు వృథాగా పోతున్నాయి. స్థానికుల సమాచారంతో హెచ్‌ఎన్‌ఎస్ అధికారులు కాలువ నీటిని గుడుపల్లె సమీపంలోని కోటచెంబగిరి, గుడుపల్లె పక్కన ఉన్న ఇరిసిగానిపల్లె చెరువులకు మళ్లించారు. గండిని పూడ్చివేసి యధావిధిగా నీటిని పరమసముద్రం చెరువుకు మళ్లించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటాం

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా దసరా సెలవుల్లో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహిస్తే అడ్డుకుంటామని విద్యార్థి జేఏసీ వైస్ చైర్మన్ షేక్‌రెడ్డి మస్తాన్ హెచ్చరించారు. ఆ సంఘ నాయకులు ఆదివారం చిత్తూరులో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు దసరా సెలవులను ఇవ్వాలన్నారు. ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

చిత్తూరులో నవరాత్రి శోభ



అమ్మవారి కటౌట్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలో ఆదివారం దసరా సందడి నెలకొంది. గిరింపేటలోని దుర్గాంబ, చాముండేశ్వరిదేవి, తేనబండలోని ముత్యాలమ్మ, గుర్రప్పనాయుడువీధిలోని అంకాళపరమేశ్వరి, పొన్నియమ్మ, ఆంజనేయస్వామి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. అమ్మవారిని కొలువుదీర్చేందుకు ప్రత్యేక మండపాలను ఏర్పాటుచేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయాల్లో సోమవారం ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించనున్నట్టు ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. నవరాత్రుల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇస్తారని వెల్లడించారు.

బంతి, చామంతి ధరల పతనం

వ్యవసాయం జూదంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు అందడం లేదు. దీంతో ఆహార పంటలు, వాణిజ్య, కూరగాయల పంటలకు బదులు పూల సాగు చేపట్టిన రైతులకూ నష్టాలు తప్పడం లేదు. ప్రస్తుతం శుభ కార్యక్రమాలు లేకపోవడం, అదే సమయంలో బయటి రాష్ట్రాల్లో పూలకు డిమాండ్ లేకపోవడంతో ఇక్కడి నుంచి ఎగుమతులు ఆగాయి. ఫలితంగా పెట్టుబడి ఖర్చులు కూడా అందడం లేదు.



పలమనేరు ప్రాంతంలో సాగవుతున్న చామంతి తోట

- బంతి కిలో రూ.5, చామంతి రూ.30లు
- కరువైన ఎగుమతులు
- పెట్టుబడి కూడా అందని వైనం
- నష్టాల బాటలో పూల రైతులు

పలమనేరు: పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని వి.కోట, శాంతిపురం, రామకుప్పం, కుప్పం, బైరెడ్డిపల్లి, గంగవరం, పెద్దపంజాణి, పలమనేరు మండలాల్లో ఏడాది పొడవునా పూల తోటలను సాగు చేస్తుంటారు. ఏటా సాధారణ పూలసాగు 800 ఎకరాలు ఉండగా, ఈ దఫా 600 ఎకరాల్లో సాగుచేపట్టారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో బంతిలో విష్ణు, అస్తగంథ, అశోక, బిగ్‌బాల్ ఆరెంజ్, ఎల్లో బంతి పూలు, చామంతిలో పేపర్ ఎల్లో, పేపర్ వైట్ రకాలను ఎక్కువగా సాగుచేశారు. ఇవన్నీ ఈస్ట్‌వెస్ట్ కంపెనీ కొత్తగా ఉత్పత్తి చేసిన హైబ్రిడ్ రకాలే. శ్రావణమాసం వరకు ఆశాజనకంగా ఉన్న పూల ధరలు ప్రస్తుతం అమాంతం తగ్గుముఖం పట్టాయి. ఇక్కడి ముఖ్యమైన పూల మార్కెట్లలో బంతి కిలో రూ.5లు, చామంతి రూ.30 వరకు పలుకుతోంది. సాధారణంగా అక్టోబరు నెలలో ధరలు బాగానే ఉంటాయి. ఈ దఫా ధర లేకుండా పోయింది. బంతి కిలో రూ.50, చామంతి కిలో రూ.100 దాకా పలికితేగానీ గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి కూడా అందడం లేదు

బంతి పూల సాగుకు ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. పంట దిగుబడి బాగా వస్తే ఎకరాకు 7 టన్నుల పూల ఉత్పత్తి జరుగుతుంది. ప్రస్తుతం టన్ను ధర రూ.5 వేలుగా ఉంది. ఆ లెక్కన రైతులకు నష్టం తప్పడం లేదు. అదే చామంతి ఎకరా సాగుకు ఖర్చు రూ.2.5లక్షల వరకు అవుతుంది. పంట దిగుబడి సగటున ఎకరాకు ఏడు టన్నులు వరకు వుంటుంది. ఇప్పుడున్న ధర కిలో రూ.30. వచ్చే ఆదాయం పూలు కోసేందుకు కూలీలకు అయ్యే ఖర్చులకు కూడా రావడం లేదని రైతులు చెబుతున్నారు.



బంతి తోట

నిండా మునిగిపోయాం



నేను రెండెకరాల్లో బంతి పూలు సాగుచేశాను. రూ.98 వేల వరకు ఖర్చు అయింది. పూల ధర కిలో రూ.5లు పలుకుతోంది. కూలీల ఖర్చులు కూడా అందడం లేదు. నిండా మునిగిపోయాం. ప్రభుత్వం మామిడి రైతులకు ఇచ్చినట్టు పూల రైతులకు కూడా ప్రోత్సాహకాన్ని అందించాలి.

–కే.క్రిష్టారెడ్డి, పెద్ద వెలగటూరు, పెద్దపంజాణి

ధరల విషయం ముందుగా చెప్పలేం



జిల్లాలో పలమనేరు, కుప్పంలో పూల సాగు ఎక్కువగా ఉంది. ప్రతి ఏటా పూలసాగు పెరుగుతోంది. పండుగ సీజన్ వస్తే మంచి ధరలుంటాయి. ప్రస్తుతం ధరలు పలకడం లేదు. ధర విషయం ముందుగా ఎవరూ చెప్పలేరు. శుభకార్యాలున్నప్పుడు పంట దిగబడి వచ్చేలా మొక్కలు నాటుకోవాలి.

–కోటేశ్వరావు, హార్టికల్చర్ ఏడీ, పలమనేరు

నేడు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతల సమావేశం

పుంగనూరు: తిరుపతిలో సోమవారం పుంగనూరు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. నియోజకవర్గంలో నూతనంగా నియమించిన వార్డు ఇన్‌చార్జ్‌లు, కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు డ్రిల్ చేయడానికి పూజ చేస్తున్న ఎంపీపీ

వి.కోట: మండలంలోని చింతమాకులపల్లి పంచాయితీ పసలమంద గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు ఎంపీపీ యువరాజ్ పరిష్కరించారు. కొత్త బోరు వేయడానికి చర్యలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పసలమంద గ్రామంలో తాము బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఆ సమయంలో గ్రామస్తులు తాగునీటి సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. దీంతో బోరు వేయడానికి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. 1,250 అడుగుల్లో మూడు ఇంచీల నీరు పడిందని తెలిపారు. త్వరలో మోటారు బిగించి నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ నేతకు నివాళి

సదుం: మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు దేవేందర్ రెడ్డి ఇటీవల మృతి చెందారు. పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం గ్రామానికి చేరుకున్నారు. దేవేందర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. పలువురిని ఆప్యాయంగా పలకరించారు. సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, సీనియర్ నాయకుడు కృష్ణారెడ్డి, సర్పంచ్ హనుమంత రెడ్డి, మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, ఆనంద రెడ్డి, జనార్ధన రెడ్డి, వెంకటస్వామి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఇమ్రాన్, పుత్రాజు, ఈశ్వర్ రెడ్డి, శివారెడ్డి, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.



దేవేందర్ రెడ్డికి నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి



రెడ్డివారిపల్లెలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఇద్దరు వ్యక్తుల ఘర్షణ

పుంగనూరు: పట్టణ సమీపంలోని కొత్తపల్లె బైపాస్ వద్ద ఆదివారం రాత్రి ఇద్దరు యువకులు ఘర్షణ పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మేలుపట్లకు చెందిన అరవింద్(30), తోపుమఠానికి చెందిన చిన్నా(40) బైపాస్ రోడ్డులో గల దాబాలో మద్యం సేవించారు. ఈ క్రమంలో రాజకీయాలు మాట్లాడుకుంటూ తమ పార్టీ గొప్పదంటే.. తమ పార్టీ గొప్పదని వాగ్వాదానికి దిగారు. వివాదం ముదిరి ఇద్దరూ ఘర్షణ పడ్డారు. అరవింద్‌కు రక్తగాయాలు కాగా, చిన్నాకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరినీ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగులో ఉత్తర్వులపై హర్షం

పలమనేరు: రాష్ట్ర ప్రభుత్వం ఒకేరోజు తెలుగులో 11 జీవోలను విడుదల చేయడం హర్షణీయమని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు తెలిపారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇదే స్ఫూర్తితో గ్రామ సచివాలయాల నుంచి రాష్ట్ర సచివాలయం దాకా తెలుగు భాషను వినియోగించాలని కోరారు. తెలుగు భాషాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం మరింత కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

గురజాడ అప్పారావుకు ఘన నివాళి



గురజాడ అప్పారావు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు

పుంగనూరు: పట్టణంలోని తాటిమాకులపాళెంలో వున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల భవనంలో ఆదివారం గురజాడ అప్పారావు జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటపతి మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన గొప్పకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని కొనియాడారు. కన్యాశుల్కం, బాల్య వివాహాలను వ్యతిరేకించారని పేర్కొన్నారు.

బస్ షెల్టర్ లేక రోడ్డుపైనే ప్రయాణికులు

రొంపిచెర్ల: తిరుపతి–బెంగళూరు జాతీయ రహదారిలోని రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో బస్సు షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం రోడ్డు మీద ఎండలోనే పడిగాపులు పడాల్సి వస్తోంది. రొంపిచెర్ల క్రాస్ నుంచి ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తిరుపతి, మదనపల్లె ప్రాంతాలకు వెళుతుంటారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు రొంపిచెర్ల క్రాస్‌లో ప్రయాణికుల కోసం బస్సు షెల్టర్ ఏర్పాటు చేయలేదు. జన సంచారం లేని మోటోళ్లపల్లె, పెద్దగొట్టిగల్లు రోడ్డులో బస్ షెల్టర్లు నిర్మించిన అధికారులు ఎక్కువ మంది ప్రయాణికులు వేచి వుండే రొంపిచెర్ల క్రాస్ రోడ్డులో బస్ షెల్టర్ ఏర్పాటుచేయకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రొంపిచెర్ల క్రాస్‌లో రోడ్డుపైన ఉన్న ప్రయాణికులు

నేటి నుంచి దసరా ఉత్సవాలు

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామంలో వెలసిన కాళికాదేవి ఆలయంలో సోమవారం నుంచి 30 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు అర్చకులు కె.బసవరాజు తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి రోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కలిస్తామని తెలిపారు. 30వ తేదీ దుర్గాదేవిగా అమ్మవారు భక్తులను కటాక్షిస్తారని వెల్లడించారు.

ముత్యాలమ్మ ఆలయంలో..

రొంపిచెర్ల: మండల కేంద్రమైన రొంపిచెర్లలో వున్న ముత్యాలమ్మ ఆలయంలో 24 నుంచి అక్టోబర్ 2 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు అర్చకులు గుణశేఖర్ తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేపట్టి భక్తులకు దర్శనం కల్పిస్తామని తెలిపారు. ఉభయదారులు ఒక రోజు ముందుగానే ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉభయదారులకు అమ్మవారి రవిక, పసుపు, కుంకుమ, గాజులు, బొందుదారాలు, నిమ్మకాయలు, తాంబూలం, తీర్థ ప్రసాదాలు అందజేస్తామని వెల్లడించారు.

కన్యకా పరమేశ్వరి ఆలయంలో..

పుంగనూరు: పట్టణంలోని బజారువీధిలో వెలసిన కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇందులో భాగంగా అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణ చేస్తామని వెల్లడించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దామోదర్‌రెడ్డి

వి.కోటలో..

వి.కోట: పట్టణంలోని దుర్గానగర్‌లో వున్న దుర్గామాత ఆలయంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ధర్మకర్త దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి నవరాత్రి ఉత్సవాల పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలతో ఉత్సవాలు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. రోజు సాయంత్రం కుంకుమార్చన, లలితా సహస్రనామార్చన చేస్తామని తెలిపారు. నిత్యం అన్నదానం చేస్తామని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు తుకారామ్, జగన్‌మోహన్, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు

చిత్తూరు కలెక్టరేట్: అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీవర్కర్ల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తామని ఫోరం ఫర్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేమేశ్వరి తెలిపారు. యూనియన్ నాయకులు ఆదివారం చిత్తూరులోని ప్రైవేట్ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీవర్కర్లు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మన ప్రాజెక్ట్, మన సంక్షేమం, హక్కుల కోసమే ప్రత్యామ్నాయంగా ఫోరం ఫర్ అంగన్‌వాడీ యూనియన్‌ను ఏర్పాటు చేశామన్నారు. యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సరస్వతి మాట్లాడుతూ త్వరలో జిల్లా స్థాయిలో పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా హామీలు నెరవేర్చకపోవడం దారుణమన్నారు. అనంతరం జీడీ నెల్లూరు ప్రాజెక్టు నుంచి శైలజను రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలిగా గోవిందమ్మ, చిలకమ్మ పలమనేరు ప్రాజెక్ట్ కార్యదర్శిగా, జీడీ నెల్లూరు ప్రాజెక్టు కమిటీ లీడర్లుగా సరస్వతి, హంసవేణి, నిర్మల, భాను, పవనకుమారి, లక్ష్మి తదితరులను ఎన్నుకున్నారు.



సమావేశంలో ఎన్నికైన యూనియన్ నూతన సభ్యులు

ఉపాధి సిబ్బందికి ఈకేవైసీ కష్టాలు

ఉపాధి హామీ పథకాన్ని మరింత పటిష్టం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా బోగస్ కూలీల హాజరుతోపాటు అక్రమాలను అరికట్టేందుకు జాబ్ కార్డులకు ఆధార్ అనుసంధానం చేయడంతోపాటు పనులకు వచ్చే కూలీలు యాప్ ద్వారా ఫేషియల్ హాజరు వేయాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందిని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు చిత్తూరు, కర్నూలు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. దీంతో సిబ్బందికి తప్పులు తప్పడం లేదు. కొంతమంది పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో వారి కోసం వెతుక్కోవాల్సి వస్తోంది.



చాడేపల్లెలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

- కూలీల కోసం వెతుకులాటలు
- నేతలను ఆశ్రయిస్తున్న వైనం
- గడువులోపు ఈకేవైసీ పూర్తి అయ్యేనా..?

చౌడేపల్లి: చిత్తూరు జిల్లాలో ఉన్న 31 మండలాలను చిత్తూరు, కుప్పం, నగరి, పుంగనూరు, సదుం క్లస్టర్లుగా ఏర్పాటుచేసింది. ఐదు క్లస్టర్లలో పనులకు వచ్చే యాక్టివ్ కూలీలు 3,78,813 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 59,102 మంది కూలీలకు మాత్రమే ఈకేవైసీ పూర్తిచేశారు. ఇందుకు కూలీలు పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లడం, ఉపాధి సిబ్బంది తక్కువగా వుండడంతో ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ కుట్రలతో 90 శాతం మంది ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. కొత్తగా వచ్చిన ఫీల్డ్ అసిస్టెంట్లు కూటమి నేతలు చెప్పిన వారికి మాత్రమే పనులు కల్పిస్తున్నారు. వారు చెప్పిన వారికే మస్టర్లు పంపుతున్నారు. ఈ నేపథ్యంలో కూలీలు ఎంత మంది ఉన్నారు..? ఎవరెవరు పనులకు వస్తున్నారు అనే వివరాలు లేవు. దీంతో ఈకేవైసీ కోసం సిబ్బంది వెంపర్లాట ప్రారంభించారు. దీనికితోడు కొన్ని వారాలుగా వేతనాలు అందకపోవడంతో కూలీలు ఇతర పనులకు వెళుతున్నారు. మరికొందరు పనుల కోసం వలసలు వెళ్లడంతో సిబ్బందికి తలనొప్పిగా మారింది. కొన్ని గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు ఈకేవైసీ చేయడంలో వెనుకంజలో ఉండడంతో మండల స్థాయి ఎంసీసీ సిబ్బంది సైతం గ్రామాల్లో మకాంపెట్టారు. చివరికి కూటమి నేతలను ఆశ్రయించి ఈకేవైసీ పూర్తి చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఈకేవైసీ పూర్తి చేయకుంటే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫేషియల్ యాప్ ద్వారా హాజరు పంపడానికి వీలు పడదు. ఈ తరుణంలో కూలీలందరికీ ఈకేవైసీ ప్రక్రియను ఈ నెలాఖరులోపు పూర్తి చేయడం సాధ్యమౌతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఈకేవైసీ క్లస్టర్ల వారీగా వివరాలు

క్లస్టర్‌పేరు	యాక్టివ్ కూలీల సంఖ్య	ఈకేవైసీ చేసిన కూలీల సంఖ్య	ఇంకా చేయాల్సిన వారి సంఖ్య
చిత్తూరు	63,101	11,998	51,103
కుప్పం	10,43,339	11,280	93,059
నగరి	9,825	15,947	52,449
పుంగనూరు	70,471	9,169	61,302
సదుం	72,506	10,708	61,798
మొత్తం	3,78,813	59,102	3,19,711



ఉపాధి కూలీలకు ఈకెవైసీ చేస్తున్న సిబ్బంది

గడువులోపు పూర్తి చేసేలా చర్యలు

ఫేషియల్ యాప్ ద్వారా హాజరును పంపేందుకు చిత్తూరు, కర్నూలు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. కూలీల ఈకేవైసీ ప్రక్రియపై ఉపాధి సిబ్బందికి అవగాహన కల్పించాం. గడువులోపు ఈకేవైసీ పూర్తిచేసేలా చర్యలు చేపట్టాం. కూలీలు అపోహలు వీడి సిబ్బందికి సహకరించాలి.

– రవికుమార్, డ్వామా పీడీ, చిత్తూరు

మాజీ సర్పంచ్ గోవిందప్ప సేవలు ఎనలేనివి



గోవిందప్ప విగ్రహానికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, బాలాజి

వ.కోట: వి.కోట మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ గోవిందప్ప సేవలు వెలకట్టలేనివని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, భారతి సిమెంట్ ఫైనాన్సియల్ డైరెక్టర్ బాలాజీ తెలిపారు. మండలంలోని కొత్తూరులో ఆదివారం గోవిందప్ప కాంస్య విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. గోవిందప్ప సర్పంచుగా ప్రజలకు అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ కుమారులు నరేంద్ర, అమరనాథ్, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.